క్లుప్తంగా

దర్గాలో ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


దాతకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం గురజాల గ్రామ వాస్తవ్యులైన ఎం. భీముడు రూ.60,311లను నగదు రూపంలో డీసీ వాణి కి అందజేశారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేత్రదానం చేయండి

ఎమ్మిగనూరురూరల్: నేత్రదానం చేసి చూపులేని వారి జీవితాల్లో వెలుగు నింపాలని ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా అన్నారు. గురువారం నేత్రదాన పక్షోత్సవాల భాగంగా ప్రభుత్వాసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మనిషి అవయవాలను దానం చేస్తే ప్రాణం పోయాక మరొకరికి ప్రాణం పోసినట్లు అవుతుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్లు శ్రీచరణ్‌రెడ్డి, చిరంజీవి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి

కౌతాళం: విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృతి చెందిగా వ్యక్తి గాయపడిన ఘటన బుధవారం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో చోటు చేసుకుంది. ఉరుకుంద మజరా గ్రామమైన తిమ్మాపురానికి చెందిన సుంకర రమేష్ తన ఎద్దుల బండిలో ఉరుకుంద నుంచి తిమ్మాపురంకు బండిలో రేకుల డబ్బా(బంకు)ను తరలిస్తుండగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కిందికి వేలాడుతున్న 33కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. రమేష్ షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానికులు రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.

ట్రాఫిక్ సీఐగా అబ్దుల్‌గౌస్



ఆదోని అర్బన్: పట్టణ ట్రాఫిక్ సీఐగా గురువారం అబ్దుల్‌గౌస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్‌కుమార్ కర్నూలు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. కర్నూలు డీటీసీ నుంచి బదిలీపై ఆదోని ట్రాఫిక్ సీఐగా అబ్దుల్‌గౌస్ వచ్చారు. ఈయన గతంలో ఆదోని ట్రాఫిక్ సీఐగా, టూటౌన్ సీఐగా పనిచేశారు.

ఎంపీపీ గ్రాంట్స్‌తో డ్రైనేజీ నిర్మాణం

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత 20 సంవత్సరాల నుంచి డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందుల పడే వారు. విషయాన్ని కాలనీ వాసులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ఎంపీపీ గ్రాంట్ నిధులతో పనులను పూర్తి చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ ధర్మన్నను ఆదేశించారు. ఈ మేరకు పనులను చేపట్టారు. పనులను గురువారం వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, ధర్మన్న, వెంకటరామిరెడ్డి పరిశీలించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో మూడో స్థానం సాధించి ప్రతిభ చూపారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్, పీడీ జి.రామన్న తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల నుంచి విద్యార్థులు ఎం.మల్లికార్జున, జయసింహా, ఈరన్న, బి.మల్లికార్జున ప్రతిభ చూపారన్నారు. అలాగే ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించారన్నారు. ఉపాధ్యాయులు నాగేంద్ర, వీరలింగప్ప, యల్లప్ప, వెంకటేష్, స్వాతి, మంజుల, మున్నా పర్వీన్ పాల్గొన్నారు.

పాసింగ్ పద్ధతిని రద్దు చేయాలి

ఆదోని రూరల్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు భారంగా మారిన పాసింగ్ పద్ధతిని రద్దు చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘాల నాయకులు లక్ష్మిరెడ్డి, సత్యనారాయణ, కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు.

కుంటల్లో చేపల విడుదల

గోనెగండ్ల : దోమల నివారణకు నిల్వ ఉన్న నీటి కుంటల్లో గంబోసియా చేపలను విడుదల చేసినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. గురువారం గోనెగండ్ల, వేముగోడులోని బావులు, మురుగు కుంటలలో చేపలను వదిలారు.


ఆదోని పాండురంగస్వామి ఆలయం వద్ద గ్రీన్ గణేశుడు


ఆదోనిలో ఒట్టి కొబ్బరికాయలతో తయారు చేసిన గణనాథుడు


కౌతాళం అమరయ్య తాత మఠం వద్ద కొలువైన గణపయ్య


పెద్దకడబూరు మండలం రంగాపురం గ్రామంలో వెలసిన లంబోదరుడు


ఆదోని మండగిరి కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం


ఎమ్మిగనూరు సోమప్ప నగర్‌లో తామర గింజలతో తయారు చేసిన గణనాథుడు

ఉండ్రాలయ్యా... దండాలయ్యా


ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూజల్లో పాల్గొన్న బుట్టా రేణుక, నాయకులు


గణనాథుడి పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: వినాయక చవితి ఉత్సవాలు ఊరూరా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బుధవారం వినాయకచవితి సందర్భంగా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం పట్టణాలతో పాటు గ్రామాల్లోని వాడవాడలా ప్రధాన రహదారుల్లో మండప నిర్వాహకులు ఏర్పాటు చేసి వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం మండపాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరి నిర్వాహకులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేళలో వినాయకులను ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా వాడవాడలా రోడ్డు పొడవునా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో మఠంలో వైభవంగా పూజోత్సవాలు గావించారు. శ్రీమఠం పూజా మందిరంలో సంస్థాన వేడుకకు ముందుగా గణనాథుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కోసిగిలోని పలు ప్రాంతాలలో కొలువుతీరిన విగ్రహాలకు పీఎస్ సుందర రాజు దొర రూ.70వేలు నగదు, అన్నదానానికి 8 క్వింటాళ్ల బియ్యం అందజేశారు.


ఆదోని భరత్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు


శ్రీమఠంలో మట్టి గణపయ్యకు పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


ఆదోనిలో మహాయోగి లక్ష్మమ్మ అవ్వతో ఉన్న విఘ్నేశ్వరుడు


ఉరుకుందలో వినాయకుడి పూజల్లో డిప్యూటీ కమిషనర్ వాణి


ఆదోని ఎల్.బి.స్ట్రీట్‌లో అరణ్య మట్టి గణపతి




జొహరాపురంలో గణనాథుడికి పూజలు గావిస్తున్న పురోహితులు, భక్తులు, గోనెగండ్లలో వినాయకుడికి పూజలు చేస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి, కోసిగిలో పూజల్లో పాల్గొన్న పీఎస్ సుందర రాజు దొర


కోసిగిలో కాళికాదేవి ఆలయం వద్ద ఆకట్టుకున్న ఊయల గణపతి


మంత్రాలయంలో వినాయకుడి మంటపం వద్ద టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి


కౌతాళంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్ ఎంపీపీ బుజ్జీస్వామి


మంత్రాలయం మండలం రచ్చమర్రిలో రూ.2.40 లక్షల విలువైన వేంకటనాథుడి రూప వినాయకుడు

రైతులను ఆదుకోవాలి


తడిసిన ఉల్లిని చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం: అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి, ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రాయచోటి, గురజాల గ్రామాలలో వర్షాలతో తడిసిన పత్తి, ఉల్లి పంటలను వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. అనంతరం నష్టపోయిన ఉల్లి రైతులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ.. కష్టపడి పండించిన పత్తి, ఉల్లి అకాల వర్షాలకు తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. శ్రమించి పండించిన గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నష్టపోయిన పత్తి, ఉల్లి రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ఉల్లిని ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరహరిరెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వరరెడ్డి, రమేష్, రామలింగడు తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కూటమి


కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసగించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ నేతృత్వంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా «ఇంటింటికీ రీకాల్ టీడీపీ మ్యానిఫెస్టో» అనే కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది కాలంలో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా ముంచారని విమర్శించారు. చంద్రబాబు పాలన అంతా దౌర్జన్యాలకే సరిపోయిందన్నారు. అమరావతి జపం చేస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ విభాగపు జిల్లా ప్రధాన కార్యదర్శి మురహరి రెడ్డి, గ్రామనాయకులు నరసింహారెడ్డి, ఈశ్వరరెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆదోని సెంట్రల్: నగరూరు- ఆస్పరి రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ట్రాక్‌పై గుర్తు తెలియని శవం పడి ఉందని సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతని దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, కుడి చేతికి ఓం, త్రిశూలం పచ్చబొట్టు ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఆదోని రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

అగ్గిపెట్టెపై ఆపరేషన్ సింధూర్ వినాయకుడు

ఆదోని రూరల్: కమ్మరచేడు ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ మల్లికార్జున ఆపరేషన్ సింధూర్ వినాయకుడు చిత్రాన్ని గీశాడు. అగ్గి పెట్టెపై సూక్ష్మ చిత్రాన్ని దాదాపు రెండు గంటలపాటు శ్రమించి వేసినట్లు ఆయన తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

ఎమ్మిగనూరురూరల్: వికలాంగుల హక్కుల సాధనకై ఉద్యమించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, మహిళా విభాగం అధ్యక్షులు నాగశేషమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమప్ప సర్కిల్‌లో జెండావిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులపై చిన్నచూపు చూస్తోందని చెప్పారు. చాల మంది అర్హులైన వికలాంగుల పింఛన్లను రీ వేరిఫికేషన్ పేరుతో నిలుపుదల చేయడం అన్యాయమని చెప్పారు.



అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరురూరల్: బయో పురుగు మందులను అనుమతులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో ఎం. శివ శంకర్ హెచ్చరించారు. గురువారం స్థానిక శ్రీ హనుమాన్ ట్రేడర్స్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.వారు మాట్లాడుతూ బయో స్టిములెంట్స్ ఓ ఫామ్ ఇంక్లూడ్ చేసుకున్న తరువాతనే బయో మందులు విక్రయించాలని సూచించారు. తనిఖీల్లో జీ1, జీ2, ఓ ఫామ్ ఇంక్లూడ్ చేయకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి రూ. 4,06,158లు విలువ గల మందుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు.

35 టన్నుల ఎరువులు సీజ్

ఆదోని రూరల్: పట్టణంలోని రాయనగర్‌లోని అవేజ్ లిమిటెడ్ ఎరువుల దుకాణాన్ని గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పవన్‌కిషోర్, విశ్వనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఎఫ్‌ఏసీటీ కంపెనీకి చెందిన సుమారు సుమారు రూ.10,85,000 విలువ కలిగిన 35 టన్నులు (700 బస్తాలు) మ్యూరియేట్ ఆఫ్ పొటాష్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

వైన్ షాపును తొలగించాలి

ఎమ్మిగనూరురూరల్:పట్టణంలోని కూరగాయల మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన వైన్ షాపును వెంటనే నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, టీయూసీఐ జిల్లా నాయకులు మాణిక్యం కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అక్కడ వైన్ షాపు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, విద్యార్థినులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. నాయకులు స్వామి, ఈశ్వర్, అభి, అబ్దుల్‌బాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


వినాయకఘాట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ హేమలత, అధికారులు

ఆదోని రూరల్: గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. గురువారం పట్టణంలో నిమజ్జన యాత్ర వెళ్లే ప్రధాన రహదారులను, నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు. విగ్రహాలు వెళ్లే దారిలో రోడ్‌లో ఉండే ప్యాచ్ వర్క్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లను అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోడ్లపై ఇసుక, కంకర అడ్డు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కెనాల్ వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ హేమలత, తహసీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఇందిరానగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయి, వైద్యులు సక్రమంగా వైద్య పరీక్షలు చేస్తున్నారా, సమయవేళలకు వస్తున్నారా అని తెలుసుకున్నారు. ఎవరైనా రోగుల పట్ల వివక్ష చూపినా, నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ సుధాకర్, డాక్టర్ పద్మకుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాటం

పెద్దకడబూరు : ప్రజలపై అధిక విద్యుత్ భారాలు మోపితే పోరాటాలు చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. 2000 సంవత్సరంలో హైదరాబాదులోని బషీర్‌బాగ్ వద్ద పోలీసుల కాల్పుల్లో అసువులు బాసిన అమరుల వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని వాల్మీకి విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు తిక్కన్న, పరమేష్, వీరేష్, ఉప్పర ఈరన్న పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఆదోని టౌన్: జాగ్రత్తలు పాటించి క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌బాను అన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్ హెల్త్ సెంటర్‌లో భావాజీపేటలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వర్, మేరీ అరుణ, సుబ్బమ్మబాయి పాల్గొన్నారు.

ఉద్యోగం ఎంచుకోవడానికి అవకాశం కల్పించండి

ఆదోని సెంట్రల్: మెగా డీఎస్సీలో అభ్యర్థులు ఉన్నత శ్రేణిని ఎంచుకునేందుకు అవకాశం కల్పించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. గురువారం ఎస్టీయూ భవనంలో ఆదోని, కౌతాళం మండలాల నాయకుల సమావేశం చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. దిగువ శ్రేణి ఉద్యోగానికి దరఖాస్తు చేసిన ఉన్నత శ్రేణికి వెళ్లేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఎస్టీయూ ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజినేయులు, ఎస్టీయూ నాయకులు సత్యన్న, సుధాకర్, షేక్షావలి, సూర్యుడు, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల : వినాయక నిమజ్జన సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం జరిగే వినాయక నిమజ్జనం వేడుకలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలన్నారు. గంజిహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాలు ఎల్లెల్సీ కాలువ, గోనెగండ్ల, హెచ్. కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల తదితర గ్రామాలు గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు.